క్లుప్తంగా

అడిషనల్ డీసీపీ రామాలయం సందర్శన

బందోబస్తుపై సిబ్బందికి సూచనలు



ఏసీపీతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: శ్రీరామ నవమి సందర్భంగా సిద్దిపేటలోని రామాలయాన్ని బుధవారం అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి సందర్శించారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి దర్శనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. శ్రీసీతారాముల కల్యాణం జరుగుతున్న ఆలయాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్, ఎస్ఐ రాజేశం తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్



సిద్దిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి, దేశ భద్రతే బీజేపీ లక్ష్యమని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్ అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు కోసం బుధవారం సిద్దిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కేంద్రం అమలు చేసిన పథకాలను వివరించారు. దేశంలో నరేంద్ర మోదీ, మెదక్‌లో రఘునందన్‌రావు నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



ప్రశాంత్‌రెడ్డితో గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): జేపీ తండాలో నిర్మిస్తున్న దుర్గ, వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బద్దిపడగకు చెందిన మహేంద్రా గ్రూపు ఆఫ్ చైర్మన్ తడిసిన ప్రశాంత్‌రెడ్డి బుధవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటైన జేపీ తండా అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేసానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుక్యా భిక్షపతి నాయక్, లక్ష్మణ్ నాయక్, వీరానాయక్, సంపత్, రమేష్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుల్జా భవానీ ఆలయం సందర్శన



వెంకట్రామిరెడ్డి గెలవాలని ముడుపు కట్టిన పురేందర్

నంగునూరు(సిద్దిపేట): మహారాష్ట్ర లోని తుల్జా భవాని ఆలయాన్ని బుధవారం సందర్శించినట్లు నంగునూరు మాజీ ఏఎంసీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంగు పురేందర్ ఫోన్ చేసి తెలిపారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఎంపీగా గెలవాలని కోరుతూ అమ్మవారికి ముడుపు కట్టినట్లు చెప్పారు. గతంలో హరీశ్‌రావు కోసం ముడుపు కట్టగా అమ్మవారి అనుగ్రహంతో ఆయన భారీ మెజార్టీతో గెలుపొందాడన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు అనంతారం రఘుపతి, సోలాపూర్ బీఆర్ఎస్ నాయకుడు కందికట్ల రఘుపతి, శ్రీనివాస్ ఉన్నారు.

ఈదురు గాలులతో వర్షం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు గాలి దుమారంతో వర్షం కురియడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అకాల వర్షం కురియడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

నేత్రపర్వం.. రాములోరి కల్యాణం

శ్రీరామ నవమి పురస్కరించుకొని బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపాలను ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలతో సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. పురోహితులు కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు వడపప్పు, పానకం అందజేశారు.



దుబ్బాకలో సీతారాముల కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



హుస్నాబాద్‌లో పట్టువస్త్రాలను తీసుకువస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



సిద్దిపేటరూరల్: చింతమడకలో ..



జగదేవ్‌పూర్(గజ్వేల్): రామునిబండలో..



వర్గల్(గజ్వేల్): మైలారంలో ..



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో..



తొగుట(దుబ్బాక): కాన్గల్‌లో..



దుబ్బాక పట్టణంలోని బాలాజీ దేవాలయంలో..



మర్కూక్(గజ్వేల్): గంగాపూర్‌లో..



చిలాపూర్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో..

రేవంత్‌రెడ్డి వైఖరి సరికాదు

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు

గజ్వేల్: మాదిగల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరి సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోని 17 ఎంపీ సీట్లలో మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు ఉండగా, ఒక్క స్థానం కూడా మాదిగలకు కేటాయించకపోవడం దారుణమన్నారు. మాదిగలు పార్లమెంటుకు వెళ్లేలా అవకాశమివ్వని రేవంత్‌రెడ్డి ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేస్తామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన మాదిగలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగలు దూరం కావడానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, రేవంత్‌రెడ్డి విధానాలేనన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశు రాములు, గజ్వేల్ కో-ఇన్‌చార్జి శ్రీహరి సింధు, ఎమ్మార్పీఎస్ నాయకులు శనిగిరి రమేశ్, ఉబ్బని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

నామినేషన్‌కు కార్యకర్తలు తరలిరావాలి

సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సీపీఎం భువనగిరి అభ్యర్థి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 19వ తేదీన భువనగిరిలో సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్ దాఖలు చేయనున్నారని, ప్రతీ కార్యకర్త రావాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, నీల భిక్షపతి, మల్లేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శెట్టి పల్లి సత్తిరెడ్డి

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఆదరణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు తిరుమల్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ పెరిగిందని మెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు తిరుమల్ రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరులో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిందన్నారు. 29 వేల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. మెదక్ ఎంపీగా నీలం మధు గెలుపే లక్ష్యమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మొద్దన్నారు. మతం పేరుతో రాజకీయం చేస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు పర్షరాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని కించపరిస్తే ఉపేక్షించం

మిరుదొడ్డి(దుబ్బాక): సొంత పార్టీని కించపరిచే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వైస్‌ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కాసులాబాద్‌లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రచార రథాన్ని అడ్డుకొని, చెప్పుల దండ వేసి అవమాన పర్చిన బీఆర్ఎస్ బూత్ కమిటీ అధ్యక్షుడు రంగనబోయిన యాదగిరిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామన్నారు.

నూతన కమిటీ నియామకం



బహుజన్ సమాజ్ పార్టీ నూతన కమిటీ

సిద్దిపేటకమాన్: బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్ బుధవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా సంజీవ్, ఈసీ మెంబర్లుగా మహేష్, తిరుపతి, నవీన్, ప్రసాద్ నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుస్నాబాద్: జాతీయ రహదారి పనుల నిమిత్తం హుస్నాబాద్‌లో గురువారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పట్టణంలోని 11 కేవీ ఫీడర్‌లో ఎల్‌సీ తీసుకోనున్నందున మల్లెచెట్టు చౌరస్తా నుంచి పందిల్ల వాగు వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజకీయాల కోసం ధర్మం తప్పొద్దు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: తమ స్వార్థ రాజకీయాల కోసం ధర్మం తప్పడం విచారకరమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో స్వార్థం పెరిగిపోతుందన్నారు. ఎన్నికష్టాలు ఎదురైన ధర్మం తపొద్దన్నారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సాయం చేయాలే తప్ప హాని తలపెట్టొద్దన్నారు. శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శమన్నారు.



దుంపలపల్లిలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

శోభాయాత్రను విజయవంతం చేయాలి

జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): హనుమాన్ జయంతి నాడు గ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీలతో హోరెత్తించాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గంగాపూర్, మర్కూక్, పాములపర్తి, దామరకుంట, ఎర్రవల్లి, చేబర్తి, నర్సన్నపేట, వర్దరాజ్‌పూర్, పాతూర్ తదితర గ్రామాలలో హనుమాన్ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్రను ప్రతీ గ్రామంలో నిర్వహించాలని, ఇంటిపై కాషాయ జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌సింగ్, హిరామాన్‌సింగ్, రాజేందర్‌సింగ్, పవన్‌సింగ్, దుర్గన్‌సింగ్, భవానీసింగ్, నరేష్‌సింగ్, జగదీష్‌సింగ్, మనిరాంసింగ్, నర్సింగ్, జేత్రాంసింగ్, తదితరులు పాల్గొన్నారు



జెండాలను పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

యూనిఫాం తీసి.. బావిలో గాలించి

- మృతదేహాన్ని వెలికి తీసిన ఏఎస్ఐ
- అభినందించిన పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: పండగ వేళ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి గజ ఈతగాళ్లు వచ్చారు. అయితే మృతుడి కుటుంబం డబ్బులు ఇవ్వలేని నిస్సహాయ స్థితి. విధి నిర్వహణలో వెళ్లిన ఏఎస్ఐ క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తెచ్చి శభాష్ అనిపించుకున్నారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రేణుకా నగర్ కాలనీ పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పట్టణానికి చెందిన బుడగ జంగాలకు చెందిన పర్వతం కనకయ్య (30) ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతిచెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న టూటౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి, తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. బావి సుమారు 15 గజాల లోతులో ఉంది. మృతదేహాన్ని బయటకు తీయడానికి గజ ఈతగాళ్లు రూ.20 వేలు అడగగా మృతుడి కుటుంబం అంత ఇవ్వలేమని చెప్పడంతో వాళ్లు వెళ్లిపోయారు. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. క్షణం ఆలస్యం చేయకుండా టూటౌన్ ఏఎస్ఐ వెంటనే యూనిఫాం తీసి సుమారు గంటసేపు బావిలో గాలించి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. పోలీసు అధికారులు, సిబ్బంది, మృతుడి బంధువులు ఏఎస్‌ని అభినందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఏఎస్ఐ ఉమారెడ్డి

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



గజ్వేల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని అంగడిపేట హనుమాన్ ఆలయం వద్ద వాసవీ క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందు వరుసలో ఉండాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది భిక్షపతి, వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్, కోశాధికారి వెంకటేశ్, పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

మత్తుతో యువత చిత్తు

- ఈజీమనీకి అలవాటుపడిన యువకులు
- గంజాయి సిగరెట్ల అమ్మకాలు
- అడ్రస్‌లు మార్చి చేరవేత
- రాత్రి వేళల్లో మైకంలో విహారం

హుస్నాబాద్: కొన్ని రోజులుగా హుస్నాబాద్ పట్టణంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. యువత గంజాయి వైపు మొగ్గు చూపుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి వారికి నిత్యావసర వస్తువుగా మారింది. యువకులు గంజాయి మత్తులో ఊగి పోతున్నారు. ఒకరిని చూసి మరొకరు అలవాటు చేసుకుంటున్నారు. చీకటి పడితే యువకులు నిర్మానుష్య ప్రదేశాల్లో గంజాయిని సేవిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. విక్రేతలు చైన్ సిస్టంగా ముగ్గురు చేతులు మారిన తర్వాతనే నాలుగో వ్యక్తికి చేరవేస్తున్నారు. విక్రయించే వ్యక్తి పరిచయం ఉన్నవారికి, నమ్మకం ఉన్నవారికే ఇస్తాడు. రెండు, మూడు అడ్రస్‌లు చెప్పి అంతా బాగుందనుకుంటేనే ప్యాకెట్‌ను చేతిలో పెట్టి క్షణంలో మాయమవుతాడు. ఒక్కో ప్యాకెట్ రూ.500 చొప్పున అంటగడుతున్నారు.

యువతే టార్గెట్

నగరాలకే పరిమితమైన గంజాయి అక్రమ రవాణా ఇప్పుడు పట్టణాలు, పల్లెలకు పాకింది. కళాశాల విద్యార్థులు, యువతను టార్గెట్ చేసి చాటుగా విక్రయిస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్స్, పోలీస్ సిబ్బంది 1500 గ్రాములు పట్టుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరికి ఎవరు సరఫరా చేస్తున్నారని విచారించగా, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ నుంచి సరఫరా అవుతోందని పోలీసులు నిర్ధారించారు. యువకులు రాత్రి సమయాల్లో సబ్ స్టేషన్, ఎల్లమ్మ చెరువు కట్ట, బస్‌డిపో గ్రౌండ్‌లో గంజాయి సేవించేందుకు అడ్డాగా ఎంచుకున్నారు. గంజాయి మత్తులో వారు ఏమి చేస్తున్నారో తెలియదు. హుస్నాబాద్‌లో గతంలో గంజాయి మత్తులో కొందమంది యువకులు రాడ్లు, సీసాలతో కొట్టుకున్న ఘటనలు ఉన్నాయి. వరంగల్, కరీంనగర్ పట్టణాల నుంచి గంజాయిని అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం. అక్కన్నపేట మండలం అక్కన్నపేట, రామవరం, గౌరవెల్లి, కుందనవానిపల్లె, కేశ్‌నాయక్ తండాల్లోనూ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది.



ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి



గంజాయి ప్యాకెట్లు

> గంజాయికి అలవాటు పడిన యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయిని ఆస్వాదించడం వారికి ఓ ప్యాషన్‌గా మారింది. యువతను టార్గెట్ చేసుకొని అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారు. గంజాయి సిగరెట్లు అమ్మితే ఎక్కువ మొత్తంలో చాలా సులభంగా డబ్బులు వస్తుండటంతో యువకులు వీటి అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు.

గంజాయి రవాణాపై నిఘా పెట్టాం



హుస్నాబాద్ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాం. పట్టణంలో ఇటీవల టాస్క్‌ఫోర్స్‌తో కలిసి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశాం. వీర్లగడ్డకు చెందిన భూక్య రమేష్ గంజాయిని రవాణా చేస్తున్నాడని తెలుసుకున్నాం. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. త్వరలో అతడిని పట్టుకుంటాం. ఎక్కడి నుంచి తెస్తున్నాడో తెలుసుకొని గంజాయి రవాణాను అరికడతాం

– మహేష్, ఎస్ఐ, హుస్నాబాద్

కొంతమందికి ఇదే పని

గంజాయి అక్రమ రవాణాను కొంత మంది ఉపాధిగా ఎంచుకుంటున్నారు. ఒక ప్యాకెట్ రూ.350లకు కొనుగోలు చేసి దానిని రూ.500 అమ్ముకుంటున్నారు. కష్టపడకుండా రూ.100 కమీషన్ వస్తుండటంతో కొంత మంది యువకులు ఇదే పనిగా పెట్టుకుంటున్నారు.